

**ముంచుకొస్తున్న ముప్పు:** వేసవికి ఇంకా మూడు నాలుగు నెలల సమయం ఉండగానే అన్ని ప్రాంతాల్లో నగరవాసులు వాటర్ ట్యాంకర్లపై ఆధారపడుతున్నారు. ఈ క్రమంలోనే ఉస్మానియా యూనివర్సిటీ సమీపంలోని ఓ బస్తీలో మంగళ వారం కనిపించిన దృశ్యమిది.


నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, బుధవారం 22 జనవరి 2025 | HYDERABAD








జూబ్లీహిల్స్‌లోని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఇంట్లో మాజీ డిప్యూటీ సీఎం మహమూద్ అలీ, ఎమ్మెల్సీలు వాణీదేవి, శంభీపూర్ రాజు, ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, మాగంటి గోపీనాథ్, ముఠాగోపాల్, మర్రి రాజశేఖర రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, వివేకానంద్, మాధవరం కృష్ణారావు, కాలేరు వెంకటేశ్‌తో సమావేశమైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

## నగరంలో అప్పుడు హ్యాపీనెస్

# ఇప్పుడు సమస్యలకు కేరాఫ్

### కాంగ్రెస్‌కు పాలన చేతకాదని ప్రజలకు అర్థమైపోయింది

**పదేండ్ల పాటు సంతోషంగా ఉన్న నగరం ఏడాదిగా సమస్యల సుడిగుండంలో..**

**తెలంగాణ గ్రోత్ ఇంజన్‌ను కాపాడాల్సిన బాధ్యత బీఆర్ఎస్‌పైనే ఉంది**

**గ్రేటర్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమావేశంలో కేటీఆర్**

సిటీబ్యూరో, జనవరి 21 (నమస్తే తెలంగాణ) : రాజధాని వాసుల కష్టాలు తీర్చే వరకూ బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు ప్రభుత్వాన్ని వదిలిపెట్టరని, ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు అర్హులందరికీ రేషన్ కార్డులు, ఫించన్లు, ఇళ్లు ఇచ్చే వరకూ పేదల పక్షాన బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ర్టానికి గుండెకాయ అయిన హైదరాబాద్ ఏడాదికాలంగా సమస్యల సుడిగుండంలో చిక్కుకుందన్నారు. సీఎంగా కేసీఆర్ సారథ్యంలో హైదరాబాద్ సంతోషానికి చిరునామాగా ఉంటే.. నేడు రేవంత్ సర్కార్ పాలనా వైఫల్యంతో సవాలక్ష కష్టాలకు కేరాఫ్‌గా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్‌లోని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ నివాసంలో మంగళవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కేటీఆర్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. హైదరాబాద్ ప్రజలు ఏడాది కాలంగా నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలపై వారితో చర్చించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న పారిశుద్ధ్య ఇబ్బందులను, తాగునీటితో పాటు ఇతర సమస్యలను ఎమ్మెల్యేలు కేటీఆర్ దృష్టికి తీసుకొచ్చారని పేర్కొన్నారు. ఎండాకాలం రాకముందే అనేక ప్రాంతాల్లో వాటర్ ట్యాంకర్లు దర్శనమిస్తున్న సంగతిని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ప్రత్యేకంగా ప్రస్తావించారు. వేళా పాళా లేని కరెంటు కోతలతో వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక రంగాలు తీవ్రంగా నష్టపోతున్నారని వివరించారు. దీంతో పాటు బీఆర్ఎస్ పాలనలో సేఫ్ సిటీకి బ్రాండ్‌గా ఉన్న హైదరాబాద్, క్రైమ్ సిటీగా మారడం, మళ్లీ పెరుగుతున్న భూకబ్జాలతో పాటు గాలికొదిలేసిన లా అండ్ ఆర్డర్‌తో నగర ప్రజల్లో రోజురోజుకు పెరుగుతున్న అభద్రతాభావంపై కేటీఆర్‌తో ఎమ్మెల్యేలు సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ సమస్యల పరిష్కారం, నగర ప్రజలకు కలిగించాల్సిన భరోసాపై ఎమ్మెల్యేలకు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు.

#### ఎన్నికల్లో ఇచ్చిన ఏ హామీ అమలు కావడం లేదు

బీఆర్ఎస్ పాలన హైదరాబాద్ నగరానికి స్వర్ణయుగం అని, మెట్రో రైలు, సివరేజీ ప్రాజెక్టులు, ఐటీ వృద్ధి, ప్రపంచ స్థాయి ప్రాజెక్టులు నగర రూపురేఖల్ని మార్చి దేశానికే గర్వ కారణంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దామని కేటీఆర్ అన్నారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ అమలు చేసిన సమగ్రమైన ప్రణాళికలతో హైదరాబాద్‌లో శాంతిభద్రతలు చెక్కు చెదరకుండా ఉన్నాయని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వానికి హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని కాపాడాలన్న సోయి కూడా లేకపోవడం దురదృష్టకరం అని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. నియోజక వర్గంలో ఏ కార్యక్రమానికి వెళ్లినా కాంగ్రెస్ పాలనలో ఎదుర్కొంటున్న దురవస్థ గురించే హైదరాబాదీలు చెబుతున్నారని ఎమ్మెల్యేలు కేటీఆర్‌కు వివరించారు. ప్రధానంగా బస్తీ వాసులు సమస్యల సుడిగుండంలో చిక్కుకుని విలవిలలాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన ఏ హామీ కూడా హైదరాబాద్‌లో అమలు కావడం లేదన్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం ఏడాది కాలంగా హైదరాబాద్‌లోని పేదలు ఎదురు చూస్తున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో హైదరాబాద్ రూపురేఖల్ని సమూలంగా మార్చిన విషయాన్ని ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తు చేశారు.

#### రోజురోజుకూ సమస్యలు పెరిగిపోతున్నాయి

హైదరాబాద్ వాసుల విలువైన సమయాన్ని ఆదా చేసే విధంగా వందేళ్ళ ముందు చూపుతో పెద్ద ఎత్తున ఫ్లైఓవర్ల నిర్మాణం చేపట్టామని, కరోనా సమయంలో కూడా యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తిచేసి ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లను హైదరాబాదులో వాసులకు అందుబాటులోకి తెచ్చామని కేటీఆర్ తెలిపారు. కొత్త రహదారుల నిర్మాణం, లింక్ రోడ్ల నిర్మాణంతో రద్దీ సమయాల్లో ట్రాఫిక్ ఇబ్బందుల్ని తీర్చి హైదరాబాద్ వాసుల అభిమానాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం సంపాదించుకుందని గుర్తు చేశారు. అయితే ప్రస్తుత ప్రభుత్వానికి తాము నిర్మించిన కట్టడాలు, నిర్మాణాల నిర్వహణ కూడా చేతకావడం లేదని కేటీఆర్ విమర్శించారు. దెబ్బతిన్న రోడ్లను కనీసం రిపేర్ చేయకపోవడంతో వాహనదారులు రోడ్డు ప్రమాదాల బారిన పడడంతో పాటు ట్రాఫిక్ కష్టాలు నిత్యకృత్యమయ్యాని మండిపడ్డారు. చెత్త సమస్యను పరిష్కరించేందుకు హైదరాబాద్‌లో ప్రవేశపెట్టిన స్వచ్ఛ ఆటోల ప్రయోగంతో విప్లవాత్మకమైన ఫలితాలను సాధించగలిగామని కేటీఆర్ చెప్పారు. కానీ నేడు హైదరాబాద్ లోని ఏ కాలనీ కి వెళ్లి చూసినా ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయి కనిపిస్తున్నదన్నారు. ఫలితంగా ఈగలు, దోమల సమస్య పెరిగి ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.

#### కాంగ్రెస్‌కు పాలన చేతకాదనే నిజం హైదరాబాద్ వాసులకు పూర్తిగా అర్థమైంది

బీఆర్ఎస్ హయంలో కంచెలు వేసి కాపాడిన ప్రభుత్వ పార్కులకు కూడా రేవంత్ సర్కార్ పాలనలో రక్షణ లేకుండా పోయిందని, అనేకచోట్ల కబ్జాలకు గురయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనా సామర్థ్యంపై హైదరాబాద్ ప్రజలకు నమ్మకం లేదన్న కేటీఆర్, ఆయనకు పాలన చేతకాదనే నిజాన్ని హైదరాబాద్ వాసులు పూర్తిగా అర్థం చేసుకున్నారని చెప్పారు. గత ఎన్నికల్లో కుల,మత, ప్రాంతాలకు అతీతంగా హైదరాబాదీలంతా పదేళ్ల అభివృద్ధికి పట్టం కట్టి బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను భారీ మెజారిటీలతో గెలిపించారని, హైదరాబాద్ ప్రజల నమ్మకానికి అనుగుణంగా వారి కష్టాలను తీర్చడమే ప్రథమ కర్తవ్యంగా పనిచేయాలని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సూచించారు. హైదరాబాద్ వాసుల కష్టాలు తీర్చేందుకు ఎప్పటికప్పుడు ప్రభుత్వాన్ని నిలదీయాలన్నారు. రాష్ర్టానికి ఎకనామిక్ ఇంజన్ అయినా హైదరాబాద్ ఇమేజీ కాంగ్రెస్ పాలనలో దారుణంగా దెబ్బతిన్నదని, ఇది కేవలం హైదరాబాద్‌కే కాకుండా యావత్ రాష్ర్టానికి మంచిది కాదన్నారు.

#### అభివృద్ధిని గాలికొదిలేసిన కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

పదేళ్లపాటు దేశంలోనే మోస్ట్ లవబుల్ సిటీగా, లివబుల్ సిటీగా అనేక ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ ర్యాంకింగ్ లో అగ్రభాగాన నిలిచిన హైదరాబాద్ గాడితప్పిన పాలన కారణంగా నేడు విలవిలలాడుతోందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ గ్రోత్ ఇంజన్‌ను కాపాడుకోవాల్సిన బాధ్యత బీఆర్ఎస్ పైనే ఉందని ఎమ్మెల్యేలకు ఎమ్మెల్సీలకు కేటీఆర్ దిశా నిర్దేశం చేశారు. గ్రామసభలు, వార్డు సభల పేరిట మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్న కాంగ్రెస్ సర్కారు, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేదలందరికీ రేషన్ కార్డులు, ఇళ్లు, పింఛన్లు ఇవ్వాలని, లేకపోతే బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ఊరుకునే ప్రసక్తే లేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తెలంగాణకు వెన్నుముక అయిన హైదరాబాద్ అభివృద్ధిని గాలికొదిలేసిన కాంగ్రెస్ సర్కారుకు నగర ప్రజల చేతిలో గుణపాఠం తప్పదని కేటీఆర్ హెచ్చరించారు.

## సైకిల్ ట్రాక్ పగుళ్లపై భగ్గుమంటున్న నెటిజన్లు

### ట్రాక్‌పై పగుళ్లకు కారణాలు అన్వేషించాలని హెచ్ఎండీఏ ఆదేశం

సిటీబ్యూరో, జనవరి 21 (నమస్తే తెలంగాణ) : వంద కోట్ల వ్యయంతో వరల్డ్ క్లాస్ సోలార్ రూఫ్ సైకిల్ ట్రాక్ నిర్వహణ లోపంతో నిర్వీర్యమైతుందని నెటిజన్లు మండిపడుతున్నారు. నగరానికి వన్నె తెచ్చేలా చేపట్టిన ప్రాజెక్టు నిర్వహణను నిర్లక్ష్యం చేయడంతో.. ఇప్పుడు సైకిలిస్టులను ఆందోళనలకు గురి చేస్తున్నది. తాజాగా సైకిల్ ట్రాక్‌పై భారీ పగుళ్లు వచ్చాయని, పనుల్లో నాణ్యత లేదని తెరమీదకు వస్తున్న ఆరోపణలపై నెటిజన్లు మండిపడుతున్నారు. నార్సింగిలో ఔటర్ రింగురోడ్డు వద్దు 26 కిలోమీటర్ల ప్రపంచ స్థాయి సైకిల్ ట్రాక్ నిర్మించగా ఏడాదిగా సరైన నిర్వహణ లేకపోవడంతో మేర పగుళ్లు వచ్చాయి. ప్రతిష్టాత్మకంగా నిర్మించిన సైకిల్ ట్రాక్‌పై వట్టినాగులపల్లి వద్ద ఇటీవల పగుళ్లకు గల కారణాలు, నివారణ చర్యలపై దృష్టి పెట్టాల్సిన హెచ్ఎండీఏ నాణ్యత లోపం ఉందంటూ పనులు చేసిన అధికారులను విచారించేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలోనే నాణ్యత పరిశీలన చేయాలని ఆదేశించినట్లుగా ఉంది.

అయితే కింది స్థాయి సిబ్బంది మాత్రం అడుగు భాగంలో ఉండే భారీ వాటర్ పైప్ వలన ఈ పగుళ్లు ఏర్పడినట్లుగా చెబుతున్నారు. కానీ ఉన్నతాధికారులు మాత్రం పనుల్లో నాణ్యత పరిశీలన ప్రక్రియ చేయడం విడ్డూరంగా ఉందని చెబుతున్నారు.

## జీహెచ్ఎంసీలో అవిశ్వాసం?

**వచ్చే నెల 10వ తేదీలో ముగియనున్న నాలుగేళ్ల పాలకమండలి గడువు**

**బీఆర్ఎస్ వ్యూహంపై విస్తృత చర్చ**

సిటీబ్యూరో, జనవరి 21(నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శోభన్ రెడ్డిలపై అవిశ్వాస కత్తి వేలాడుతున్నదా? బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లిన వీరిపై బీఆర్ఎస్ పార్టీ అవిశ్వాస తీర్మానానికి సిద్ధమవుతున్నదా? ఇందులో భాగంగానే మంగళవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఇంట్లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో జరిగిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమావేశంలో మేయర్‌పై అవిశ్వాస తీర్మానం చర్చకు రావడంతో అటు రాజకీయ వర్గాలు, ఇటు కార్పొరేటర్లలో విస్తృత చర్చనీయాంశమైంది. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పార్టీ నుంచి పోటీ చేసి గెలిచిన విజయలక్ష్మి, మోతె శ్రీలతకు మేయర్ , డిప్యూటీ మేయర్ పదవులు వరించాయి. అప్పట్లో ఎంఐఎం బీఆర్ఎస్‌కు అండగా నిలిచింది. ఏడాదికి పైగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వీరిద్దరూ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మేయర్, డిప్యూటీ మేయర్లపై తీరుపై అటు బీఆర్ఎస్, ఇటు కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లు గత కొంతకాలంగా ఆసంతృప్తితో ఉన్నారు. ఏడాదిలో జీహెచ్ఎంసీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అవిశ్వాసం తెరపైకి వచ్చింది. జీహెచ్ఎంసీ చట్టం ప్రకారం పాలక మండలి పదవీ బాధ్యతలు చేపట్టాక నాలుగేళ్ల వరకు వారిపై అవిశ్వాస తీర్మానం పెట్టే అవకాశం లేదు. జీహెచ్ఎంసీ పాలకమండలి ఎన్నికలు 2020 డిసెంబరులో జరిగినప్పటికీ మేయర్, డిప్యూటీ మేయర్‌లు 2021 ఫిబ్రవరి 11వ తేదీన బాధ్యతలు చేపట్టారు. వచ్చే నెల 10వ తేదీతో వారి నాలుగేళ్ల కాలం పూర్తవుతున్నందున ఆది ముగియగానే అవిశ్వాసం పెట్టేందుకు కార్పొరేటర్లు సిద్ధమవుతుండడం, ఈ సమయంలో బీఆర్ఎస్ పార్టీ సైతం వారి పదవులను తప్పించాలనే ఎత్తు గడకు సన్నద్ధమవుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. అయితే నిబంధనల ప్రకారం అవిశ్వాస తీర్మానం పెట్టాలంటే మొత్తం కార్పొరేటర్లు, ఎక్స్ ఆఫీషియో సభ్యులు (స్థానిక ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు) సగం మంది నిర్ణీత ప్రొఫార్మాలో తీర్మానం చేసి సంతకాలు పెట్టి జిల్లా కలెక్టర్‌కు అందజేయాలి. జీహెచ్ఎంసీలో 150 డివిజన్లకుగానూ 146 మంది కార్పొరేటర్లు ఉన్నారు. ఇద్దరు కార్పొరేటర్లు (ఎర్రగడ్డ, గుడిమల్కాపూర్) అనారోగ్యంతో చనిపోగా, మరో ఇద్దరు ఎంఐఎం కార్పొరేటర్లు ఎమ్మెల్యేలుగా మెహిదీపట్నం, బహదూర్‌పుర నియోజకవర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 146 మంది కార్పొరేటర్లకు 50 మంది ఎక్స్ ఆఫీషియో సభ్యులు వెరసి మొత్తం 196 మంది సభ్యులు సంతకాలు అవసరం. ఇందులో దాదాపు 2/3 మెజార్టీ ఉంటే అవిశ్వాసం నెగ్గుతుంది. అంటే దాదాపు 131 మంది సంతకాలు అవసరం ఉంటాయి. కార్పొరేటర్లు, ఎక్స్ ఆఫీషియోలతో కలిసి 60 మందితో బలంగా ఉన్న బీఆర్ఎస్, అవిశ్వాస తీర్మానం పెట్టి ఎలాంటి వ్యూహం ఆచరిస్తుందని అని రాజకీయ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నది.




# కేసీఆర్ పథకమే శరణ్యం!

### సీఆర్ఎంపీ స్కీంలో రేవంత్ సర్కారు రివర్స్ గేర్

**గతంలో పక్కన పెట్టిన ప్రతిపాదనలకు బూజు దులిపిన జీహెచ్ఎంసీ**

**రెండు విడతల సీఆర్ఎంపీని 3825 కోట్లతోచేపడుతున్నట్లు వెల్లడి**

సిటీబ్యూరో, జనవరి 21 (నమస్తే తెలంగాణ) : కేసీఆర్ పథకాలను ఆనవాళ్లు లేకుండా చేస్తామన్న రేవంత్ సర్కారుకు క్షేత్రస్థాయిలో అసాధ్యం కాదని తేలిపోయింది. ఎస్ఆర్‌డీపీ, ఎస్ఎన్‌డీపీ పథకాలను స్థానంలో హెచ్ సిటీ ప్రాజెక్టును తెరపైకి తీసుకువచ్చి..పాత ప్రతిపాదనలనే పట్టాలెక్కిస్తున్నది. తాజాగా కాంప్రెహెన్సివ్ రోడ్ మెయింటనెన్స్ ప్రోగ్రామ్ (సీఆర్ఎంపీ) పథకాన్ని తిరిగి కొనసాగించేందుకు సిద్ధమైంది. ఎల్లవేళలా సాఫీ ప్రయాణానికి అనువుగా ఉండాలనేది సీఆర్ఎంపీ లక్ష్యం. ప్రధాన రహదారుల నిర్వహణలో భాగంగా 510 విభాగాలుగా విభజించి తొలి విడతగా 744 కిలోమీటర్ల రహదారిని 2020 సంవత్సరంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రైవేట్ ఎజెన్సీలకు నిర్వహణ బాధ్యతలు అప్పగించింది. నిర్ణీత గడువులో మొదటి విడతను పూర్తి చేసి గుంతలు లేని నగరంగా తీర్చిదిద్దింది. ఈ సీఆర్ఎంపీ విధానం ఇతర మెట్రో నగరాలకు ఆదర్శంగా నిలిచింది. ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు ఇప్పటికే సీఆర్ఎంపీ మోడల్ వివరాలను తీసుకోగా.. ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌కు చెందిన పలు కార్పొరేషన్లు పురపాలక శాఖను సంప్రదించారు. ఇటువంటి పథకాన్ని కొత్త ప్రభుత్వం సాగనీయకపోవడంపై అనేక విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే మొదటి విడత పథకం నిర్వహణను మళ్లీ ప్రైవేట్ ఎజెన్సీలకు అప్పగించడంతో పాటు కొత్తగా రెండవ విడతలో రూ. 424 చోట్లకుగానూ 398.32 కిలోమీటర్ల మేరలో రూ.1334 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. రెండు విడతలు కలిపి 934 ప్రాంతాల్లో 1142.54 కిలోమీటర్ల మేరలో రూ.3825 కిలోమీటర్లలో సీఆర్ఎంపీ రోడ్ల నిర్వహణ ప్రతిపాదనలు సిద్ధం చేసిన అధికారులు రేపు (గురువారం) జరిగే స్టాండింగ్ కమిటీ సమావేశం ముందుకు తీసుకురానున్నారు. సీఆర్ఎంపీ పథకం ప్రతిపాదనలపై సుదీర్ఘంగా చర్చించి ఆమోదిస్తారా? లేదా? అన్నది వేచి చూడాల్సిందే.

**సీఆర్ఎంపీ పథకం వివరాలు..**

| జోన్ | మొదటి దశ సీఆర్ఎంపీ భాగాలు/కి.మీలు/ రూ.వ్యయం | కొత్త ప్రతిపాదనలు (రెండవ దశ) భాగాలు/కి.మీలు/ రూ.వ్యయం | మొత్తం భాగాలు/కి.మీలు/ రూ.వ్యయం |
|---|---|---|---|
| ఎల్బీనగర్ | 79/140.18/రూ.420 | 85/80.89/ రూ.254 | 164/221.07/రూ.674 |
| చార్మినార్ | 93/132.52/402 | 68/58.52/150 | 161/191.04/552 |
| ఖైరతాబాద్-1 | 88/86.84/343 | 44/34.37/93 | 132/121.21/436 |
| ఖైరతాబాద్-2 | 72/78.87/326 | 50/35.83/102 | 122/114.70/428 |
| శేరిలింగంపల్లి | 48/90.46/258 | 87/84.51/291 | 135/174.97/549 |
| కూకట్‌పల్లి | 32/86.74/340 | 45/74/329 | 77/160.74/669 |
| సికింద్రాబాద్ | 98/128.61/402 | 45/30.20/115 | 143/158.81/517 |
| మొత్తం | **510/744.22/2491** | **424/398.32/1334** | **934/1142.54/3825** |

# ఇందిరమ్మ ఇండ్లు.. ఎండమావులే

**జాబితాలో పేరే లేని లబ్ధిదారులు**

**అటకెక్కిన ప్రజాపాలన దరఖాస్తులు**

**మళ్లీ దరఖాస్తు చేసుకోవాలంటూ అధికారుల సూచన**

**కలెక్టర్ ఆదేశించినా లబ్ధిదారు పేరును చేర్చని వైనం**

**నిరసనలు నిలదీతలతో మార్మోగిన గ్రామ సభలు**

మేడ్చల్, జనవరి21(నమస్తే తెలంగాణ): ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామన్నారు. దరఖాస్తు చేసుకుంటే చాలు రేషన్ కార్డు ఇస్తామన్నారు. పేర్లివ్వండి చాలు ఆత్మీయ భరోసా, రైతు భరోసా అందిస్తామని హామీ ఇచ్చారు. తీరా అమలు చేసే సమయానికి జాబితాలో పేర్లు లేవని చెబుతున్నారు. ఇదీ కాంగ్రెస్ నిర్వహిస్తున్న ప్రజాపాలన తీరు. లబ్ధిదారుల ఎంపికలో, పథకాల మంజూరీలో ప్రభుత్వం ఇప్పటికీ ఒక స్పష్టతకు రాలేదు. అందువల్లే ప్రజాపాలనలో దరఖాస్తులు ఇచ్చిన అర్హులైన చాలామంది పేర్లు ఎంపిక జాబితాలో లేవు. దీంతో మేడ్చల్ జిల్లాలో జరిగిన గ్రామసభల్లో పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమయ్యాయి. ప్రతిచోటా అధికారులను నిలదీశారు.

#### స్పష్టత కొరవడి..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మంగళవారం నాలుగు గ్యారెంటీల అమలు కోసం నిర్వహించిన గ్రామ, వార్డు సభలలో ఇందిరమ్మ, ఇళ్లు, రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాల లబ్ధిదారుల ఎంపికలో భాగంగా ఎంపిక చేసిన జాబితాను ప్రజల మధ్య పేర్లను వినిపించారు. ఈ క్రమంలో జాబితాలో పేర్లు లేని వారు నిరసనలు తెలుపుతూ ఆందోళనకు దిగారు. తమ పేర్లు ఎందుకు లేవని తాము అర్హులం కాదా? అంటూ అధికారులను ప్రశ్నించారు. దీంతో అధికారులు మాట్లాడుతూ పథకాలకు సంబంధించి జాబితాలో పేర్లు లేని వారు తిరిగి దరఖాస్తులు చేసుకుంటే విచారణ జరిపి పథకాలను మంజూరు చేస్తామని చెప్పారు. మరి ప్రజాపాలనలో దరఖాస్తులు ఎందుకు స్వీకరించారంటూ ప్రశ్నించారు. ఏడాది క్రితం పథకాల కోసం దరఖాస్తులు చేసుకున్నామని, ఇప్పుడైనా ఎంపిక జాబితాలో తమ పేర్లు ఉంటాయని భావించిన దరఖాస్తుదారులకు నిరాశే ఎదురైంది. ఇందిరమ్మ ఇళ్ల, రేషన్ కార్డుల జారీలో అర్హులలో ఎలాంటి ప్రమాణాలు పాటించారన్న విషయంలో స్పష్టత లేకుండా పోయింది. తిరిగి దరఖాస్తులు చేసుకుంటే మళ్లీ పథకాలు ఎప్పుడు మంజూరు చేస్తారని దరఖాస్తుదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి 1.44 లక్షల మంది దరఖాస్తులు చేసుకోగా రేషన్ కార్డుల కోసం 1.22 లక్షల మంది ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్నారు.



మల్కాజిగిరి జిల్లా అలియాబాద్‌లో జరిగిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే పర్యవేక్షణలో పద్మ ఇంటిని పరిశీలించిన జిల్లా కలెక్టర్ గౌతమ్, ప్రత్యేక అధికారి శశాంక(ఫైల్)

#### జిల్లా కలెక్టర్ చెప్పినా జాబితాలో పేరు లేదు

ఇందిరమ్మ ఇంటి పథకానికి అలియాబాద్‌కు చెందిన విలాసాగరం పద్మను ఎంపిక జాబితాలో చేర్చాలని స్వయంగా జిల్లా కలెక్టర్ గౌతమ్, ప్రత్యేక అధికారి శశాంక అధికారులకు ఆదేశించిన జాబితా పేరును చేర్చకపోడం విస్మయానికి గురి చేసింది. ఇందిరమ్మ ఇళ్ల పథకం మంజూరులో భాగంగా ఈ నెల 17న అలియాబాద్‌లో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను జిల్లా కలెక్టర్ గౌతమ్, జిల్లా ప్రత్యేక అధికారి శశాంకలు పద్మ చెందిన ఇంటిని పరిశీలించి ఇందిరమ్మ ఇంటి పథకానికి అర్హురాలిగా ఎంపిక జాబితాలో చేర్చాలని ఎంపీడీవో మమతాబాయి, కార్యదర్శి శ్రీనివాస్‌లను ఆదేశించిన ఎంపిక జాబితాలో పేరు రాకపోవడం గమనార్హం. పద్మ పేరును జాబితా చేర్చకపోవడంపై ఎంపీడీవో మమతాబాయిని వివరణ కోరగా కలెక్టర్ ఆదేశించిన మాటా నిజమేనని ఒప్పుకున్నారు. ఇందిరమ్మ ఇంటి పథకంలో భాగంగా చేసిన సర్వేలో ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పద్మ భర్త ఇటీవల పక్షవాతంతో మరణించంగా 60 గజాల స్థలంలో రేకుల ఇంట్లో నివాసం ఉంటున్నది.



#### ఎన్నిసార్లు దరఖాస్తు పెట్టాలె

మా ఇంటికి ఏసారూ రాలేదు. లిస్టులో పేరు లేదంటున్నారు.ఇంకా ఎన్నిసార్లు దరఖాస్తు పెట్టాలే. చిన్నపిల్లల్ని సాకలేకున్నాం.రేషన్‌కారటు వస్తుందనుకున్న. మల్ల ఇప్పుడు దరఖాస్తు చేసుకోమంటున్నరు. **- దుర్గ, ఇందిరానగర్ కాలనీ, బోడుప్పల్**

#### కాంగ్రెసోళ్లకు ఇండ్లు ఇచ్చిండ్రు



నేను కూలీ పని చేసుకుంటా. ఇందిరమ్మ ఇంటి కోసం ధరఖాస్తు చేసుకున్న నాకు రాలేదు. ఇండ్లు ఉన్న కాంగ్రెసోళ్లకు ఇండ్లు వచ్చినట్లుగా ఆఫీసర్లు పేర్లు చెప్పిండ్రు. ఇది ఎక్కడి న్యాయం. ఈ పేర్లను మొత్తం రద్దు చేయాలి.కొత్తగా చూసి ఇండ్లు లేనోళ్లకు ఇయ్యాలె.

**-కొడకండ్ల సత్తయ్య. ఇస్మాయిల్ ఖాన్‌గూడ, పోచారం మున్సిపాలిటీ.**



#### ఇండ్లు ఎందుకియ్యరు?

రేషన్‌కార్డులు ఇస్తామని చెప్పి ఇప్పుడు లిస్టులో పేరులేదంటున్నరు.మేము కిరాయి ఇండ్లలో ఉంటున్నం. ఇందిరమ్మ ఇండ్లు ఎందుకియ్యరు. మల్లా ఎందుకు దరఖాస్తు చేసుకోవాలి- అంటూ బోడుప్పల్ 1వ డివిజన్ కార్పొరేటర్ బింగి జంగయ్యయాదవ్‌ను నిలదీస్తున్న మహిళలు...

#### ఓట్ల కోసమే హామీలు ఇచ్చిండ్రా



కొత్త ప్రభుత్వం వచ్చి ఆదుకుంటది అనుకున్న. ఏ ఆధారం లేకుండా అద్దె ఇంట్లో ఉంటున్న. గత ప్రభుత్వం ఇచ్చిన పింఛన్‌తో జీవితం ఎల్లదీస్తున్న. అందరికీ ఇండ్లు ఇస్తామంటే దరఖాస్తు చేసుకున్న. ఈ రోజు జరిగిన వార్డు సభలో నా పేరు రాలేదు. చాలా బాధగా ఉంది. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయితే ఫించన్లు పెరుగుతయ్. రేషన్ కార్డులు వస్తయంటే ఇందిరమ్మ ఇండ్లు ఇస్తరంటే ఆశపడిన. కేవలం ఓట్ల కోసమే హామీలు ఇచ్చిండ్రని ఇప్పుడు తెలుస్తుంది. మాటలే తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం పనులు చేయదని తెలుస్తున్నది. ఇప్పటికైనా అర్హులను గుర్తించాలని డిమాండ్ చేస్తున్నా. **- సబేరున్నీసా, ఎన్ఎఫ్‌సీనగర్**